
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 2 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 24.4



ఆలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

మేడే స్ఫూర్తితో ప్రజా.. పోరాటాలు

8

- మేడే వేడుకల్లో వక్తల పిలుపు
- జిల్లావ్యాప్తంగా కార్మికుల ఘనంగా దినోత్సవం

హుజూర్‌నగర్ నుంచి అనలాగ్ మిషన్ వరకు

- అనలాగ్ వ్యోమగామి శిక్షణకు యువ శాస్త్రవేత్త మోహన్‌సాయి
- అమెరికా అరిజోనాలో ఈ నెల 5 నుంచి 9 వరకు శిక్షణ



6

పునర్వైభవంపై కాంగ్రెస్.. నజర్



- క్షేత్రస్థాయి నుంచి పార్టీ ప్రక్షాళన
- పార్టీ బలోపేతం దిశగా అడుగులు
- డీసీసీల పనితీరుపై సమీక్ష
- అందర్నీ సమన్వయం చేసుకునే నేతలకే పార్టీ పగ్గాలు
- ఏకపక్ష నిర్ణయాలు, పార్టీ నేతలతో సఖ్యతలేని వారికి ఉద్వాసన
- ఇకనుంచి నేరుగా ఢిల్లీ పెద్దలకు టచ్‌లో డీసీసీ అధ్యక్షులు

కాంగ్రెస్ పునర్వైభవం దిశగా అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీని ప్రక్షాళన చేసి, ముఖ్యంగా పార్టీ కమిటీలను బలోపేతం చేసేందుకు సన్నద్ధమవుతోంది. మూడు నెలల్లోగా దేశవ్యాప్తంగా జిల్లా కమిటీలను బలోపేతం చేయాలని భావిస్తోంది. డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే, ఎంపీ, తదితర టిక్కెట్లతోపాటు నామినేటెడ్ పదవులు కూడా సిఫారసు చేసే దిశగా సన్నాహాలు చేస్తోంది. అయితే ఇందుకోసం జిల్లాలో అందర్నీ సమన్వయం చేసుకునే నేతలకే డీసీసీ పగ్గాలు అప్పగించాలని యోచిస్తోంది.

(ఆంధ్రజ్యోతి- యాదాద్రి)

ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల సిఫారసులతో ఎన్నికైన డీసీసీ అధ్యక్షుల పనితీరుపై సమీక్ష నిర్వహించి, పార్టీకి సరైన సమయం, అధిష్ఠానం సూచించిన మేరకు పనిచేయని వారికి ఉద్వాసన పలకాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఏఐసీసీ అన్ని జిల్లా కమిటీలపై సమీక్ష నిర్వహించి, త్వరలోనే పార్టీపరంగా కఠిన నిర్ణయాలు తీసుకోనుంది. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్షుడితో పాటు డీసీసీ అధ్యక్షులను అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎన్నిక చేసింది. డీసీసీ అధ్యక్షులను ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు పార్టీకి అనుబంధ కమిటీలైన యువజన, రైతు, కార్మిక, విద్యార్థి, తదితర విభాగాలతోపాటు జిల్లాస్థాయిలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎంపిక చేయలేదు. ఈనేపథ్యంలో ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షులపై మరోసారి సమీక్ష నిర్వహించి, నూతనంగా జిల్లాలకు సారధులను నియమించడంతోపాటు కార్యవర్గాలను, అనుబంధ కమిటీలను వెంటనే ఏర్పాటు చేసేందుకు ఏఐసీసీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఏఐసీసీ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డీసీసీ అధ్యక్షుల మార్పుతోపాటు పార్టీని విజయతీరాల వైపు నడిపించే సత్తా ఉన్న నేతలకు పగ్గాలు అప్పగించాలని సూచించారు. దేశవ్యాప్తంగా అన్నిజిల్లాల్లోనూ డీసీసీలపై ప్రక్షాళన చేపట్టనున్నట్లు కూడా ప్రకటించారు.

హడావుడిగా డీసీసీ పగ్గాలు


ఈ నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నిల ముందు హడావుడిగా స్థానిక ఎంపీలు, మాజీ మంత్రులు, పార్టీలోని సీనియర్ నేతలు సూచించిన వ్యక్తులకు డీసీసీ పగ్గాలు అప్పగించారు. అయితే వారు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో పనిచేయకపోగా, పార్టీలోని అందర్నీ కలుపుకుపోవడంలేదని సొంత పార్టీలోని కార్యకర్తలు, నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు సైతం..అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తాము కష్టపడి గెలిపించినప్పటికీ, తమకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని.. పార్టీలోని సీనియర్లకు విలువ కూడా ఇవ్వడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గం లో జరిగే పార్టీతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం తమకు సమాచారం అందించడంలేదని.. ఏకపక్షంగా పార్టీ నిర్ణయాలు తీసుకుంటుందని బహిరంగంగానే పార్టీలోని సీనియర్ నేతలు సహా, స్థానిక నేతలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలన్నీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు ఏకపక్షంగా నిర్ణయాలతోపాటు పార్టీ కార్యక్రమాలు సీనియర్లకు విధిగా సమాచారం ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీని వీలైనంత త్వరగా ప్రక్షాళన చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల పనితీరుపై సమీక్ష నిర్వహించి, ఎవరెవరు పార్టీలోని సీనియర్లు, ఇతర నేతలను కలుపుకుని పనిచేస్తున్నారు. పార్టీ పిలుపును కూడా అందుకుని కనీసం నిరసన కార్యక్రమాలు చేపట్టని డీసీసీ అధ్యక్షులెవ్వరన్న వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. జిల్లాల్లో పార్టీ నేతలను సమన్వయం చేసుకోకుండా ఒంటెత్తు పోకడలు, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న వారిని డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి, అందర్నీ సమన్వయపరుచుకునే నేతలను పార్టీ పగ్గాలు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా డీసీసీ అధ్యక్షుల పనితీరుపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. ఎవరెవర్ని మార్చి పూర్తిస్థాయిలో కార్యవర్గాలను ఎంపిక చేయాలన్నది కూడా పార్టీ యోచిస్తోంది.

ఇకనుంచి నేరుగా ఢిల్లీ పెద్దలకు టచ్‌లో డీసీసీ అధ్యక్షులు

డీసీసీ అధ్యక్షులు ఇకనుంచి నేరుగా ఢిల్లీ పెద్దలకు టచ్‌లో ఉండేలా పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం ఏఐసీసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టుగా సమాచారం. అయితే డీసీసీలే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కోసం సిఫారసు చేసే యోచన పార్టీలో ఉండటంతో.. ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షుల స్థాయిలో సమీక్ష నిర్వహించనుంది. చాలాచోట్ల డీసీసీ అధ్యక్షులు నామమాత్రంగా అప్పటి ఎంపీలు, పలుకుబడి ఉన్న నేతల సిఫారసు మేరకు నియమించినట్టుగా అధిష్ఠానం భావిస్తుంది. ఇప్పటివరకు కొంతమంది డీసీసీలు అధిష్ఠానం సూచించిన కార్యక్రమాలు కూడా స్థానికంగా ఉన్న నేతలను సమన్వయం పరుచుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదో ఒక ఎంపీ, ఎమ్మెల్యే కనుసన్నల్లోనే డీసీసీ అధ్యక్షులు పనిచేస్తున్నారని, పార్టీని నేతలందర్నీ సమన్వయం పరుచుకోకపోగా, ఏకపక్షంగా పార్టీ నిర్ణయాలు తీసుకుంటున్నట్టుగా పార్టీ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో జిల్లాల్లోని పార్టీ సీనియర్లకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందని భావిస్తుంది. త్వరలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీల్లోనూ మార్పులు, చేర్పులు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

స్వతంత్ర నిర్ణయం తీసుకునే అధికారం

దేశవ్యాప్తంగా పార్టీలోని బలోపేతం దశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యంగా డీసీసీలను బలోపేతం చేసి. జిల్లా అధ్యక్షులకు విస్తృత అధికారాలు, బాధ్యతలు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తుంది. గతంలో పార్టీలోని డీసీసీలు కీలక పాత్ర వహించేది. జిల్లా అధ్యక్షులు తర్వాత కాలంలో క్రమంగా ప్రాముఖ్యం కోల్పోయారు. వారికి పూర్వ వైభవం కల్పించాలని అగ్రనేతలు భావిస్తున్నారు. పీసీసీలు, డీసీసీలకు నిర్దిష్ట బాధ్యతలు నిర్దేశించాలని నిర్ణయించింది. పార్టీకి సంబంధించిన అనేక అంశాల్లోనూ డీసీసీలకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం ఇవ్వాలని, జాతీయ స్థాయిలో తీసుకునే ప్రతీ నిర్ణయం జిల్లా అధ్యక్షుల సలహాలు, సంప్రదింపుల ద్వారా తీసుకోవాలని భావిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండే జిల్లా నేతలకే జనం నాడి తెలుస్తుందని, క్షేత్రస్థాయిలో వారి నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ద్వారా జాతీయస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తుంది. మూడు నెలల్లోగా జిల్లా కమిటీలను పటిష్ఠం చేయాలని, జిల్లా కమిటీల సూచనల మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ టికెట్లను ఖరారు చేసే యోచన ఉన్నట్టుగా ససమాచారం.



విద్యయే ప్రగతికి సోపానం

- వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి
- ప్రతిభ, నైపుణ్యాలకు పారితోషికాలు
- ఇంటర్ ప్రిన్సిపాల్స్‌తో సమీక్షలో కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యయే ప్రగతికి సోపానం అని కలెక్టర్ ఎం. హనుమంతరావు అన్నారు. గురువారం జిల్లాలోని ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టరేట్‌లో పరీక్షల ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఇంటర్ విద్య భవిష్యత్ సూచికగా నిలుస్తుందన్నారు. పేదరికం రూపుమాపడానికి విద్యనే మార్గమన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరేవిధంగా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రభుత్వ కళాశాలల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ ఉత్తీర్ణతా శాతం, విద్యార్థుల ప్రతిభపై కళాశాలలవారీగా ప్రిన్సిపాల్స్‌తో ముఖాముఖి నిర్వహించారు. మరింత ఉత్తీర్ణత సాధించేందుకు మొదటి, రెండో సంవత్సరాల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫలితాలు మెరుగు పడాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అదేవిధంగా విద్యార్థులు పట్టుదలతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ విద్యార్థులకు పారితోషికాలు అందజేస్తూ ఉపాధ్యాయులు ఆత్మస్థైర్యం కల్పించాలన్నారు. అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురికి వారి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో సన్మానించి సైకిళ్లను అందజేశారు. వచ్చే ఏడాది ప్రతీ కళాశాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తే 50 సైకిళ్ల అందజేస్తామన్నారు. సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జీ.వీరారెడ్డి, ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, జిల్లా ఇంటర్ అధికారి రమణి, డీఆర్డీవో టీ.నాగిరెడ్డి, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సర ఇంటర్‌లో జిల్లాస్థాయిలో ప్రథమ సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ హనుమంతరావు సైకిళ్ల పంపిణీ చేశారు. ధీరజ్(ఎంపీసీ), శ్రేష్ఠ(సీఈసీ), నందిని (ఎంఎల్‌టీ)లు అత్యధిక మార్కులు సాధించగా, కలెక్టర్ సైకిళ్ల బహుమతిగా అందించారు.

వలిగొండ: డాక్టర్ కావాలనే పట్టుదలతో చదవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మండల కేంద్రానికి చెందిన శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గంజి సరస్వతి ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక ఫలితాల్లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు 425 మార్కులు సాధించారు. కలెక్టర్ విద్యార్థిని అభినందించి సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతకుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

గడువు తేదీ పొడిగింపు

- 3వరకు ఎల్ఆర్ఎస్, 7 వరకు ఆస్తిపన్ను చెల్లింపు గడువు



భువనగిరి మునిసిపల్ కార్యాలయం

భువనగిరి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మొన్నటితో ముగిసిన రాయితీలతో రెండు చెల్లింపు గడువులను ప్రభుత్వం పొడిగించింది. 25శాతం రాయితీతో ఫీజు చెల్లింపు గడువు, ఐదు శాతం రాయితీతో ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపు గడువు ఏప్రిల్ 30తో ముగిశాయి. కానీ ఆ రెండు గడువులను ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 7 వరకు పొడిగించింది. దీంతో ప్రభుత్వం ఇచ్చిన రెండు గడువుల పొడిగింపు అవకాశాలను సంబంధితులు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ అధికారులు సూచిస్తున్నారు. భువనగిరి మునిసిపాలిటీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.9.23కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉండగా, నేటివరకు రూ.1.42కోట్లు ముందస్తు ఆస్తి పన్ను వసూలయింది. అయితే 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువు వాస్తవానికి మార్చి 31తో ముగిసింది. కానీ ప్రభుత్వం రాయితీ చెల్లింపు ఏప్రిల్ 30వరకు పొడిగించింది. తిరిగి రెండోసారి గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు భువనగిరి మునిసిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 26 ఆగస్టు 2020 నాటికి 15,534 దరఖాస్తులు రాగా, అధికారులు వడపోసి సుమారు 6,124 దరఖాస్తులు ఫీజు చెల్లింపునకు అర్హత ఉన్నవిగా గుర్తించి యజమానులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇప్పటి వరకు 4,350 దరఖాస్తుల ద్వారా రూ.11.85 కోట్ల ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలయింది.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- అఖిల భారత సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహదేవ్



సమావేశంలో మాట్లాడుతున్న మహదేవ్

భూదాన్‌పోచంపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత పదేళ్లలో జరిగిన భూదాన్ భూముల అన్యాక్రాంతం, అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని అఖిల భారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భూదాన్‌పోచంపల్లిలోని వినోబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆలిండియా సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవిందారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణగౌడ్, డా. వెదిరె ప్రమోదీష్ చంద్రారెడ్డిలతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వం భూదాన్ భూముల అన్యాక్రాంతంపై విచారణకు ఆదేశించిందన్నారు. భూదాన్‌యజ్ఞ బోర్డు లేకపోవడంవల్లే అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వెంటనే భూదాన్ భూముల పరిరక్షణకు యజ్ఞబోర్డునేర్పాటు చేయాలన్నారు. సమావేశంలో భూదాన్ రామచంద్రారెడ్డి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెదిరె వినయ్‌చంద్రారెడ్డి, గౌరవ సలహాదారుడు గునిగంటి మల్లేష్‌గౌడ్, అధ్యక్షుడు పోతగల్ల దానయ్య, కరగల్ల కుమార్, కొమ్ము లక్ష్మణ్, వంగూరి రాజు, చేరాల లింగస్వామి, నల్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీపై కేసు

- కంపెనీ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని సందీప్ తల్లి ఫిర్యాదుతో కేసు

6

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవి లత

భువనగిరి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలపై కార్మికులు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత అన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం భువనగిరి కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్మికుల ప్రయోజనాలు, హక్కుల పరిరక్షణకు పలు చట్టాలు ఉన్నాయన్నారు. ఉల్లంఘించే యాజమాన్యాలను చట్ట ప్రకారం ప్రశ్నించి ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. విధుల నిర్వహణలో కార్మికులు క్రమశిక్షణ, చిత్తశుద్ధి చూపాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్యగౌడ్, బొల్లేపల్లి కుమార్, న్యాయవాదులు ఎస్.జైపాల్, జి.శంకర్, ఎన్.రాజశేఖర్, సాయి, శ్రీనివాస్, ప్రకాశ్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

రామన్నపేట: మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా చట్టాలపై అవగాహన సదస్సు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్స్ సివిల్ జడ్జి మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ బి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎస్.శిరీషా పాల్గొని మాట్లాడారు. శ్రమయే సమాజానికి మూలమని, కార్మికులకు సరైన సౌకర్యాలు అందించే విధంగా యజమాన్యం చూడాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, న్యాయవాదులు హనుమంతు, యాదయ్య, వెంకట్‌రెడ్డి, బి.అశోక్‌కుమార్, బి.డేవిడ్, దినేష్ కుమార్, ఎస్. స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవిలత

భద్రకాళి అమ్మవారికి పోచంపల్లి వస్త్రాలు

భూదాన్‌పోచంపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి భద్రేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 2న నిర్వహించే కల్యాణోత్సవానికి భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు రూపొందించిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు వస్త్రాలను సమర్పించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన చేనేత కళాకారులు రుద్ర శ్రీశైలం, రుద్ర చెన్నకేశవులు, రుద్ర పాండురంగశాస్త్రి కుటుంబ సభ్యులు మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను తయారు చేశారు. గత 15 రోజులుగా శ్రమించి అమ్మవారికి చిలుకపచ్చ, సోఫ్రాన్ రంగు కలిగిన రెండు చేనేత ఇక్కత్ పట్టు చీరలతోపాటు స్వామివారికి పట్టు పంచెలను తయారు చేశారు. కల్యాణం రోజున ప్రదర్శనగా వెళ్లి పట్టు వస్త్రాలతోపాటు తలంబ్రాలను ఈవో కే శేషుభారతికి అందజేయనున్నారు. ఈ సందర్భంగా భూదాన్‌పోచంపల్లిలోని చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం మాట్లాడుతూ తాము గత ఐదు సంవత్సరాలుగా వరంగల్ భద్రకాళి అమ్మవారికి, భద్రేశ్వర్‌స్వామికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం తమకు కల్పించిన దేవస్థానం అధికారులకు, పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



భద్రకాళి అమ్మవారికి పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు

అన్ని వర్గాల అభివృద్ధి కోసమే కులగణన

- మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్



6

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

6

- నల్లగొండ జిల్లాకేంద్రంలో వివరాలు వెల్లడించిన సీఐ రాజశేఖర్‌రెడ్డి

మాధవ రెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మాధవరెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న లక్ష్మయ్య, నాయకులు

చౌటుప్పల్ టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో ప్రాణ త్యాగం చేసిన దివంగత ఎలిమినేటి మాధవ రెడ్డి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని టీడీపీ మునుగోడు ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో ఎలిమినేటి మాధవరెడ్డి జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ పేద వారి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి మాధవరెడ్డి అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నల్ల పర్వతాలు, మారగోని అశోక్, పట్టణ అధ్యక్షుడు సుంకరి జంగయ్య, నాయకులు గుమ్మడి అంజిరెడ్డి, తడక కోటేశ్వర్, నూనె వెంకటేశం, సింగిరెడ్డి సురేందర్ రెడ్డి, గోశిక పాండు, పి. గోవిందా చారి, గోగినేని కృష్ణ తేజ, గుర్రం నర్సింహ్మ, చెరుకు అశోక్, ఆకుల శంకరయ్య, బోదుల గనేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నగోని అంజయ్య, మాజీ సర్పంచ్ ఊదరి నర్సింహులు మాధవ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీపై కేసు నమోదు

మోటకొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేందర్ యాదవ్ తెలిపారు. కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్ 2019 నుంచి ప్రీమియర్ ఎక్‌ప్లోజివ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4.45గంటల సమయంలో కంపెనీలోని 18-ఏ భవనంలో జరిగిన పేలుడు ధాటికి ఏడుగురు తీవ్రంగా గాయపడగా, కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్(30), మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్(22) శిథిలాలకింద చిక్కుకుని మృతిచెందారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పేలుడు సంభవించిందని సందీప్ తల్లి గునుగుంట్ల మంగమ్మ ఫిర్యాదు మేరకు కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రొడక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద గోవులు తరలిస్తున్న వాహనాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు 14 గోవులను డీసీఎంలో తరలిస్తుండగా పంతంగి టోల్‌గేటు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

శాలిగౌరారం, మే 1 (ఆంధ్రజ్యోతి): పొలంలో మేత మేస్తున్న పశువులు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన కొనపాకుల యాదయ్య రెండు గేదెలు పొలంలో మేత మేస్తుండగా ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మేత కోసం వచ్చిన గేదలు ఆ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.05లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన గనగాని అశోక్‌కు చెందిన ఎద్దు గ్రామ శివారులో మేత మేస్తుండగా అప్పటికే తెగి పడి నేల మీద ఉన్న తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.75 వేల వరకు ఉంటుందని బాధితుడు అశోక్ తెలిపాడు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

పార్ధి గ్యాంగ్‌కు 18 నెలల జైలు శిక్ష

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర దొంగల ముఠా పార్ధి గ్యాంగ్ నిందితులకు కోర్టు 18నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధించిందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. నిందితులు కొన్ని నెలల క్రితం నల్లగొండ జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాలతో పాటు సైబర్ కమిషనరేట్ పరిధిలో, సంగారెడ్డి జిల్లాలో ఎన్‌హెచ్ -65పై వాహనాలను ఆపి నిద్రిస్తున్న వారిపై దాడి చేసి బంగారం డబ్బులు దొంగిలించేవారు. గత ఏడాది మే 18న కట్టంగూరు పీఎస్ పరిధిలో మహారాష్ట్రకు చెందిన నిందితులైన అప్ర పదాంగ, దిల్‌షార్ అశోక్ పవార్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసులు నమోదు చేసి సరైన ఆధారాలను సేకరించి కోర్టులో చార్జ్ షీటు దాఖలు చేశారు. కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ఒక్కరికి రూ.1000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల పాటు సాధారణ కారాగార జైళ్లు శిక్ష ఉంటుందని తెలిపారు. పార్ధి గ్యాంగ్ మొత్తం 32 కేసుల్లో నేరాలు అంగీకరించింది. ఈ కేసును త్వరితగతిన ఛేదించి శిక్ష పడేలా కృషిచేసిన నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు, అప్పటి ఎస్‌ఐ సైదాబాబు, చిట్యాల పీఎస్ పోలీస్ ఎస్‌ఐ ప్రసుత్త ఎస్‌ఐ ధర్మా, సీడీవో ముత్తిలింగం, లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్‌లను ఎస్పీ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వలిగొండ, మే 1(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సూర్యాపేట జిల్లా వలిగొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దుప్పల్లి గ్రామ మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు కట్టెల నర్సయ్య, నీల రవి, పలుసం నర్సయ్యపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


యాదగిరి(ఫైల్)

హాలియా, మే 1(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి నల్లగొండ జిల్లా అనుముల మం డలం మదారిగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీ గురువారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన కుందారపు యాదగిరి(48) గురువారం ఉపాధి హామీ పనికి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా వడదెబ్బకు తోడు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మేడే సందర్భంగా హాలియాలో కార్మిక వేడుకల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జడ్జిల బాధ్యతల స్వీకరణ


యాదగిరిగుట్ట కోర్టు న్యాయమూర్తి చండీశ్వరిదేవిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆలేరు, యాదగిరిగుట్ట రూరల్, మిర్యాలగూడ లీగల్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా అజయ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు న్యాయవాదులు జడ్జికి స్వాగతం పలికారు. ఇక్కడ పని చేసిన జడ్జి సూర సుమలత పదోన్నతిపై వెళ్లడంతో ఆమె స్థానంలో భువనగిరి సివిల్ కోర్టు జడ్జి కవిత ఇన్‌చార్జి జడ్జిగా కొంత కాలం పనిచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వనం రాజు, సీనియర్ న్యాయవాదులు జూకంటి రవీందర్, తుంగ హరికృష్ణ, రావుల రజితరెడ్డి, పి రవిందర్, పాషా, రాజశేఖర్, సిద్దులు, శివకుమార్ ఉన్నారు. యాదగిరిగుట్ట న్యాయమూర్తిగా చండీశ్వరిదేవి బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సూదగాని శ్రీహరిగౌడ్, గుడ్ల స్వామి, న్యాయవాదులు ఎం. రాజిరెడ్డి, పెంట రమేష్, ఐరేని కృష్ణ, దండెబోయిన గణేష్‌యాదవ్, బి. రేణుక, వినీత, కనకరాజు, దప్పు వీరస్వామి, గొట్టిపాముల సాయికృష్ణ పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ జూనియర్ సివిల్ జడ్జిగా పి.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి జి.వేణు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, కార్యదర్శి ఎ.రాజ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు గౌరు వెంకటేశ్వర్లు, సీహెచ్.రాఘరామరావు, జిన్నె శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, మంద సైదులు, కుమార్ రెడ్డి, గంగాభవాని, నాగేందర్, ఇస్మా, పూసపాటి పరమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మోటకొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం సంభవించిన భారీ పేలుడు దాటికి మరణించిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షలు, గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు మాజీ సహాయ ప్రభుత్వ న్యాయవాది గొరిగే మల్లేష్ డిమాండ్ చేశారు. కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిసరాలను, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంట గొరిగే అయిలయ్య, జెన్ని రఘు, గొరిగే పెద్ద మల్లేష్ ఉన్నారు.

హుజూర్‌నగర్ నుంచి అనలాగ్ మిషన్ వరకు

● అనలాగ్ వ్యోమగామి శిక్షణకు యువ శాస్త్రవేత్త మోహన్‌సాయి ● అమెరికా అరిజోనాలో మే 5 నుంచి 9 వరకు శిక్షణ ● ప్రపంచవ్యాప్తంగా 18 మంది శాస్త్రవేత్తలకు అవకాశం


అన్‌లాగ్ మిషన్‌కు ఎంపికైన యువశాస్త్రవేత్త మోహన్‌సాయి

హుజూర్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యువ శాస్త్రవేత్త ఆకుల మోహన్‌సాయికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని అరిజోనాలో మే 5 నుంచి 9వ తేదీ వరకు ప్రపంచంలోని అతిపెద్ద అనలాగ్ వ్యోమగామి శిక్షణకు ఎంపికయ్యారు. బయోస్పియర్-2 అనే అనలాగ్ స్థావరంలో జరిగే ఈ శిక్షణకు ప్రపంచ నలుమూలల నుంచి 18మంది యువ శాస్త్రవేత్తలకు అవకాశం దక్కింది. భారతదేశం నుంచి ఇద్దరికి అవకాశం రాగా అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి మోహన్‌సాయి ఒకరు. ఈ శిక్షణ మార్స్ లాంటి ఉపరితలం లాంటి పరిస్థితుల్లో జీవించడం, పనిచేయడం, అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది.

ప్రస్తుతం మోహన్‌సాయి ముంబాయిలోని అమిటీ యూనివర్సిటీలో ఆస్ట్రో బయాలజీ అండ్ స్పేస్ సైన్స్ 2023-25 కోర్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక విద్యార్థిగా విద్యనభ్యసిస్తున్నారు. మాస్టర్స్ థీసిస్-లూనార్ సోయిల్ సిములెంట్ (ఎల్ఎస్ఎస్)పై పంటలు పెంచడంపై ప్రయోగాత్మక పరిశోధన చేస్తూ భారత భవిష్యత్ చంద్రయాన స్థిర నివాసాల కోసం ప్రయత్నిస్తున్నారు. రెండేళ్లుగా హైదరాబాద్, బెంగళూరు, పూనే వంటి నగరాల్లో నాలుగు వేల మంది విద్యార్థులకుపైగా శాస్త్ర విజ్ఞానాన్ని చేరువ చేస్తూ స్పేస్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు.

వర్చువల్ ట్రైనింగ్ పూర్తి చేసి..

2004 ఫిబ్రవరిలో ప్రపంచ స్థాయి వరల్డ్ బిగ్గెస్ట్ అనలాగ్ మిషన్‌కు 2200 మందికి పైగా దరఖాస్తు చేశారు. 18 మందిని ఎంపిక చేయగా అందులో సాయి ఒకరు. సహచరుల సమీక్షలతో కూడిన మాద్యుశ్క్య సైకలాజికల్, కాగ్నిటివ్ అసెస్‌మెంట్లు, సాంకేతిక ఇంటర్వ్యూలు, సిద్ధాంత పాఠాలు, మిషన్ అనుకరణలు పూర్తిచేసి 2024 నవంబరులో నిర్వహించిన వర్చువల్ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తిచేసి డిసెంబరులో జరిగిన



తుదిపరీక్షల్లో 97శాతం స్కోర్ సాధించి 2025 జనవరి 25న ఎంపికయ్యారు.

● 2035 భారత్ అంతరిక్ష స్టేషన్, 2040లో చంద్రుడిపై మొదటి మానవ మిషన్ చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మోహన్‌సాయి తన పరిశోధన, శిక్షణలతో దేశం తరపున ఈ లక్ష్యాలను బలపరుస్తున్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ ప్రయాణాలు, శిక్షణలు, మిషన్ వ్యయాలను భరించిన మోహన్‌సాయి తన శాస్త్రీయ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ముందుకు సాగుతున్నారు. వైజ్ఞానిక పరిశోధన, జీవన పోరాటం, ప్రపంచస్థాయి ప్రతినిధిత్వం-ఇవన్నీ ఆర్థిక అడ్డంకులతో పోరాడుతూ సమతుల్యం చేస్తున్నట్లు మోహన్‌సాయి పేర్కొంటున్నారు. అమెరికా దేశానికి పరిశోధనకు మే 2న వెళుతున్న మోహన్‌సాయి ప్రపంచంలోనే అతిపెద్ద అనలాగ్ వ్యోమగామి మిషన్‌కు వెళుతున్న తరుణంలో క్లిష్టమైన మిషన్‌లో శిక్షణ పూర్తిచేసుకునేందుకు దృష్టి సారించినట్లు మోహన్‌సాయి తన లక్ష్యాన్ని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఉత్తమ పరిశోధన అవార్డు



మోహన్‌సాయి 2023-24 సంవత్సరాల్లో రెండు అంతర్జాతీయ లూనార్ అన్‌లాగ్ మిషన్లు(పోలాండ్, యూరప్) పూర్తిచేశారు. మొదటి మిషన్ తర్వాత ఐఎస్ఆర్ఓ ఆధ్వర్యంలో జరిగిన ఎన్ఎస్ఎస్ఎస్ 2024లో ఉత్తమ పరిశోధన అవార్డు అందుకున్నారు. ఏప్రిల్ 2024న పోలాండ్‌లోని మిలటరీ ఏరోస్పేస్ ఇనిస్టిట్యూట్‌లో +4.5జీ సెంట్రిఫ్యూజ్ అండ్ జీరో గ్రావిటీ శిక్షణ పొందారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రీయ దౌత్యాన్ని ప్రోత్సహిస్తూ 2024 అక్టోబరులో లూనారెస్ రీసెర్చ్ స్టేషన్(యూరప్) వారు భారత అంతరిక్ష దౌత్య ప్రతినిధిగా మోహన్‌సాయిని ప్రకటించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దర్మాటి దుర్గాప్రసాద్, కాకినాడకు చెందిన పాశిల సత్యనారాయణ, అదే జిల్లాకు చెందిన కామాడి శ్రీనివాస్ 2024 సంవత్సరం అక్టోబరులో నల్లగొండలో రైలులో వచ్చి అలకాపురి కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి రెండు బంగారు చైన్‌లు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే సంవత్సరం డిసెంబరు లో నల్లగొండ పట్టణంలో మహిళా ప్రాంగణం పరిధిలో ఇంటి ఎదుట పార్కు చేసిన పల్సర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ ముగ్గురు దొంగలు గతంలో ఎత్తుకెళ్లిన పల్సర్ బైక్‌పై కాకినాడ నుంచి నల్లగొండకు వచ్చి అక్కలాయిగూడెం ప్రాంతంలో తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించి తాళాలు పగులగొట్టి 12తులాల బంగారం ఆభరణాలు, 50తులాల వెండి, రూ.1.25లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ మూడు నేరాల్లో నిందితుల పోలీసులు నుంచి బంగారు ఆభరణాలు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం దర్మాటి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నారన్నాడు. సత్యనారాయణ, శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బి. డానియెల్‌కుమార్, ఎస్‌ఐ శివకుమార్, సిబ్బంది విష్ణు, సీఐ రాజశేఖర్‌రెడ్డిని, నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌ఐ గోపాల్‌రావును, హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, అంజద్, గాంధీలను డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు.

పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తూ..


దుర్గాప్రసాద్ (ఫైల్)

బీబీనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరై స్నేహితులతో ఆనందంగా గడిపి అనంతరం ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన కూనూరు అమరేందర్‌గౌడ్ ఏకైక కుమారుడు కూనూరు దుర్గాప్రసాద్ (20) ఐఎఫ్‌టీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం కాటేపల్లి గ్రామంలోని ఎక్స్‌ప్లో కంపెనీలో పేలుడు ఘటనలో మృతి చెందిన సందీప్ అంత్యక్రియలో పాల్గొని అదేరోజు సాయంత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు బయలు దేరి వెళ్లాడు. రాత్రంతా స్నేహితులతో ఆనందంగా గడిపి తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై స్వగ్రామం కాటేపల్లికి బయలు దేరాడు. మార్గమధ్యలో బీబీనగర్ బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టడంతో బైకు అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ ప్రమాద సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్ని అంశాలపై అవగాహన కల్పించాలి

● నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి


విద్యార్థులతో చెస్ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు, విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాకేంద్రంలోని బోయవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. శిక్షణ శిబిరానికి వచ్చిన పిల్లలతో కలెక్టర్ ముచ్చటించారు. ఏ సబ్జెక్టు అంటే ఇష్టమని, ఎలాంటి ఆటలు ఇష్టమని, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి చెస్ ఆడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతోపాటు, అన్ని విషయాల్లో ముందు ఉండాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని నల్లగొండ పట్టణంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, స్కెచ్ పెన్లు, వాటర్ కలర్స్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు నిర్వహించే ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఇండోర్ గేమ్స్, డాన్స్, హస్తకళలు, డ్రాయింగ్, పెయింటింగ్, కెరియర్ గైడెన్స్, నైతిక విలువలు, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాలలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. బిక్షపతి, నాగార్జునసాగర్ బాలకేంద్రం పర్యవేక్షకులు, బాల కేంద్రం ఇన్‌చార్జి బాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ. అంజద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి కోసమే కులగణన

● బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్


మోటకొండూరు మండలం కాటేపల్లిలోని ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ పేలుడులో మృతిచెందిన దేవిచరణ్ తల్లిని ఓదారుస్తున్న మాజీ ఎంపీ బూర

భువనగిరి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం కులగణ చేపడతుందని మాజీ ఎంపీ, ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. భువనగిరిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1931లో దేశంలో బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని తిరిగి బీజేపీ హయాంలో జరుగుతుందన్నారు. దేశంలో ఇప్పటివరకు ఆరు పర్యాయాలు జనాభా లెక్కలు జరగగా దేశాన్ని అధికంగా పాలించిన కాంగ్రెస్ హయాంలో ఐదు పర్యాయాలు జనాభా లెక్కల గణన జరిగిందని, కానీ ఏ ఒక్కసారి ఆ పార్టీ కులగణనను చేపట్టలేదని విమర్శించారు. తెలంగాణలో 53శాతం ఉన్న బీసీలను రాజకీయంగా అణగ తొక్కిందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో 43శాతానికి పరిమితం చేసిందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం మాత్రం దేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టనుందన్నారు. అగ్రవర్ణాల పేదలకు బీజేపీ అమలులోకి తెచ్చిన 10శాతం ఈ బీసీ రిజర్వేషన్లతో ముస్లింలతో సహా హిందూ అగ్రవర్ణాల పేదలు, ఐఏఎస్, ఐపీఎస్ తదితర ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారనేది విస్మరించరాని నిజమన్నారు. మోటకొండూరు మండలం ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ పేలుళ్ల దుర్ఘటనను కేంద్ర మంత్రులు, కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. పరిశ్రమ నిర్వహణ, భద్రతా, కార్మికుల శిక్షణా లోపాలతోనే ప్రమాదం ఆరోపించిందన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ నుంచి రావల్సిన బెనిఫీట్స్‌లను ఇప్పిస్తామని, పరిశ్రమ నిర్వహణ, అనుమతులపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కులగణనపై హర్షిస్తూ ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా, పట్టణ అధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్, రత్నపురం బలరాం, పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, ఎండీ మహ్మద్ నాయకులు మాయ దశరథ, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, పట్నం శ్రీనివాస్, డీఎల్ఎన్ గౌడ్, జి నరసింహచారి పాల్గొన్నారు.

పేలుడు బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు(ఎం), మోటకొండూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు సంఘటనలో మృతిచెందిన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కల్వల నరేష్(32) కుటుంబసభ్యులను భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గురువారం పరామర్శించారు. నరేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నరేష్ తండ్రి అంజయ్యకు ధైర్యం చెప్పారు. పేలుడు ఘటనలో మృతిచెందిన మోటకొండూరు మండలంలోని గునుగుంట్ల సందీప్, చందోజు దేవిచరణ్ కుటుంబసభ్యులను కూడా పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్, జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు యెల్లంల శ్రీధర్‌రెడ్డి జి. కాశీనాథ్, డి. కుమారస్వామి, బి. అబ్బయ్య, బి. ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కొండమల్లేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి స్థానిక చౌరస్తాలో గురువారం రాత్రి ఇన్‌చార్జి సీఐ రాజుతో కలిసి చేసి బ్రీత్ ఎనలైజర్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై సరైన పత్రాలు, నంబర్ ప్లేటు లేని వాహనాలపై మొత్తం 20మందిపై కేసులు నమోదు చేసినట్టు కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ రాజు తెలిపారు. తనిఖీలో కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్‌ఐ నరసింహులు, రాము, నాగరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు


యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

చిన్నారుల ఆట విడుపు

పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయ్. ఇళ్ల వద్ద ఉంటున్న చిన్నారులు వివిధ ఆటలతో గడుపుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో చిన్నారులు గురువారం క్రికెట్ ఆడి సందడి చేశారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి- యాదాద్రి

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

రామన్నపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 1 నుంచి అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా అన్ని వసతులతో పాటు డాక్టరేట్ పొందిన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ఆధారిత విద్యా బోధన అందిస్తామని తెలిపారు. జాతీయ సేవా పథకం రెండు యూనిట్లు, అధునాత గ్రంథాలయ సౌకర్యం ఉందని తెలిఆరు. విశాలమైన ఆట స్థలంతో పాటు ఆధునిక సౌకర్యాలతో కూడి జిమ్ ఉందని, మెరిట్ స్కాలర్‌షిప్‌లతో పాటు, విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ బహుకరిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ధాన్యం కల్లాలు లేక

● రహదారులపై ఆరబోస్తున్న రైతులు
● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఆరుగాలం కష్టపడి పంటను సాగు చేసే రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. పంట పండించడం ఒక్క ఎత్తయితే చేతికి అందిన ధాన్యం విక్రయానికి, అరబెట్టడానికి అవస్థలు పడుతున్నారు. ధాన్యం ఆర బెట్టుకోవడానికి కొనుగోలు కేంద్రంలో స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబోస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)



యాదగిరిగుట్ట మండలం మల్లాపురం రోడ్డుపైన ఆరబోసిన ధాన్యం

ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తేమ 17శాతం ఉంటేనే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. దీంతో రైతులు రైతులు తమ ధాన్యాన్ని తేమ లేకుండా రోజుల తరబడి ఆరబెట్టాల్సి పరిస్థితి నెలకొంది. ఆరబెట్ట డానికి సరియైనా ఖాళీ ప్రదేశాలు లేక రైతులు రోడ్లపై లేదా గ్రామాల్లో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ నానా తిప్పలు పడుతున్నారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో గతనెల నుంచి వరికోతలు మొదలై య్యాయి. ధాన్యం చేతికి రావడంతో తేమ తగ్గించి విక్రయించడానికి ఖాళీ ప్రదేశాలు, కొనుగోలు కేంద్రాలు, గ్రామాల్లో ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. ఆరబెట్టే ప్రాంతానికి ధాన్యం తరలించడానికి అక్కడ నుంచి కొనుగోలు కేంద్రానికి తీసుకరావడానికి రవాణాభారం అధికమవుతోంది. ఒకవేళ ధాన్యం రోడ్డుపై ఆరబోయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒకవేళ వర్షం వస్తే ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనేక ఇబ్బందులు పడుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఇలా..

మండలాలు : 17,
గ్రామ పంచాయతీలు : 248
వరి సాగు : 2.83 లక్షల ఎకరాలు,
రైతులు : 2.81లక్షలు,

ఈజీఎస్ ద్వారా కల్లాల నిర్మాణం అవకాశం

రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంలో వారి ఇబ్బందులను తొలగించడానికి గత ప్రభుత్వం కల్లాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. జిల్లా గ్రామీణాభివృద్ది శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణం చేపట్టారు. రైతులకు సొంతభూమి ఉన్న రైతులకు ఈజీఎస్ ద్వారా ఇవి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అధికారులు రైతులకు సరిగా అవగాహన కల్పించకపోవడంతో పాటుగా బిల్లు రావడం లేదని కల్లాల నిర్మాణానికి రైతులు సుముఖంగా లేకపోవడంతో ముందకు రాలేదు.. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో 1500 కల్లాలు మంజూరు కాగా కేవలం 390 కల్లాలు మాత్రమే నిర్మించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిధులు నిలిపి వేశారు

గతంలో రైతులు తమ భూముల్లో కల్లాలు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభు త్వం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసేది. దాంతో కొందరు రైతులు కల్లాలు నిర్మించుకున్నారు. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నిలిపి వేయడంతో కల్లాల నిర్మాణం నిలిచిపోయింది.

-నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి భువనగిరి జిల్లా

డబ్బులు ముందే చెల్లించాలి



గతంలో ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి డబ్బులు సరిగ్గా ఇవ్వడపోవడంతో కల్లం నిర్మించుకోలేదు.. సొంత డబ్బులు ఖర్చు పెట్టి కల్లాలు నిర్మించుకొనే స్తోమత లేదు. ప్రస్తుతం ధాన్యం ఆరబోసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి ముందుగానే డబ్బులు చెల్లిస్తే బాగుంటుంది.

-తాళ్ల ఉప్పల్‌రెడ్డి, రైతు

మిస్‌వరల్డ్ పోటీదారులకు పటిష్ట భద్రత

● ఐజీ సత్యనారాయణ ● నాగార్జునసాగర్‌లో ఏర్పాట్ల పరిశీలన



బుద్ధవనాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్రపవార్ తదితరులు

నాగార్జునసాగర్, మే 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పాల్గొనే పోటీదారులు మే 12వ తేదీన సాగర్‌కు రానున్న సందర్భంగా పటిష్ట భద్రతను కల్పించనున్నట్లు ఐజీ సత్యనారాయణ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలో బుద్ధవనం, విజయ విహార్ అతిథి గృహాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ నెల 10 నుంచి 31వ వరకు నిర్వహించనున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే పోటీదారుల్లో ఆసియా దేశాల నుంచి 30 మంది ఈ నెల 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా సాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనాన్ని సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. సాగర్‌కు వచ్చే పోటీదారులకు అసౌకర్యాలు కలగకుండా 1500 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న సాయంత్రం 4:30 నుంచి 7:30 గంటల వరకు మిస్ వరల్డ్ పోటీదారులు సాగర్‌లో ఉంటారని తెలిపారు. ముందుగా విజయవిహార్ అతిథి గృహానికి చేరుకోని కాసేపు సేద తీరిన అనంతరం బుద్ధ పూర్ణిమ ఉత్సవాలల్లో పాల్గొంటారన్నారు. బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం మహాస్తూపం లోపలి వైపున ఉన్న ధ్యాన మందిరంలో కాసేపు ధ్యానం చేస్తారని తెలిపారు. పోటీదారులు హైదరాబాద్ నుంచి సాగర్‌కు చేరుకొని మళ్లీ తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, దేవరకొండ అడిషనల్‌ఎస్పీ మౌనిక పర్యవేక్షణలో భద్రత చర్యలను చేపడతారని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో గ్లోబల్ ఈవెంట్ కాబట్టి ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉందన్నారు. మిస్ వరల్డ్ పోటీల విషయంలో కొందరు నిరసన తెలియజేస్తున్నారు కాబట్టి వారిని ముందుగానే గుర్తించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా నిరసనలు చేపడితే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగర్ పర్యటన విషయంలో ఎలాంటి అంతరాయం జరిగిన మిస్ వరల్డ్ పోటీదారులపై ఎంతో ప్రభావం పడుతుందన్నారు. పోలీసు శాఖ ఈ పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మీడియా కూడా పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సాగర్ సీఐ శ్రీను నాయక్, సాగర్, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐలు సంపత్, వీరబాబు, వీరశేఖర్, సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

● మరో అడుగు పెరిగిన నీటిమట్టం



మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు 25 రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం గత 25 రోజుల్లో 6 అడుగుల మేర పెరిగింది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను వేసిన నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 623.50అడుగులు (0.71టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మూసీ నది పరివాహక ప్రాంత గ్రామాలు, హైదరాబాద్‌లో కురుస్తున్న అకాల వర్షాలు, హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పారుతున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుండటంతో ప్రాజెక్టుకు దాదాపు 380 క్యూసెక్కుల పైచిలుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో పాయింట్ చొప్పున పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఇటీవలి వరకు 630.10అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి మరో అడుగు పెరిగి 631.05 అడుగులు (1.54టీఎంసీలు)గా నమోదైంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 624.20 అడుగులు (0.675టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులుగా ఉంది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



తిరువీధి సేవలో ప్రబంధ పారాయణాలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట మే 1 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపలంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వెఢూర్యాలుతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది, వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తు



యాదగిరిగుట్టలో క్యూలైన్లో భక్తులు

లను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి శేషవస్త్రాలు అశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆఆలయంలో నిత్య పూజలు జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు యాగశాలలో నిత్య రుద్రహనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. అయితే వేసవి సెలవులు కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 32,67,774 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.

వైభవంగా పురపాట్టు సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో గురువారం వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం ఆలయ పూజారులు నిర్వహించారు. జగద్గురు రామానుజాచార్య తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా ప్రబంధ అధ్యాపకులలో కార్యమం నిర్వహించారు. రామానుజచార్య అళ్వార్ సేవతో తిరువీధుల్లో ప్రబంధ పారాయణాలు చేపట్టి పురప్పాట్టు సేవ నిర్వహించారు.



యాదగిరిగుట్టలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

సమాజ చైతన్యానికి రచనలు చేయాలి

● ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న

మిర్యాలగూడ అర్బన్, మే1(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సమాజ చైతన్యాన్ని అవసరమైన రచనలు చేయాలని ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన గోరేటి వెంకన్న పాట, మాటల స్ఫూర్తి సామాజిక సాహిత్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఆర్ట్స్‌కాలేజీ ప్రొఫెసర్ ఖాసీం, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రజా చైతన్యం కోసం కవులు, కళాకారులు, రచయితలు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం కస్తూరి ప్రభాకర్ రచించిన మట్టికాళ్ల ముట్టడి, మదనం, ప్రభాకర చలనం పుస్తకాలను వారు ఆవిష్కరించారు. సాహిత్య సదస్సుకు ముందు చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక, చిత్రకళా ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ప్రముఖ కార్టూనిస్టు నర్సిం, జడ్పీ మాజీచైర్మన్ సీడీ రవి కుమార్, మానవహక్కుల వేదిక నాయకులు పి.సుబ్బారావు, నాగ వర్ధన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, సాహితీవేత్తలు ఉప్పుల పద్మ, సైదులు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాలు, రామలింగయ్య, రవి, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని రోడ్డు పనులు

● కల్వర్టులకే పరిమితమైన డీజీ తండా - కోనాపూర్, ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా పనులు
● శంకుస్థాపన దశలోనే పొట్టిమర్రి తండా - నాగాయపల్లి రోడ్డు
● ఇబ్బంది పడుతున్న ప్రజలు



పొట్టిమర్రితండా -నాగాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు

తుర్కపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించినట్లుగా ఉంది గిరిజన తండాల పరిస్థితి. తండాల్లోకి వెళ్లే అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ఆయా గిరిజన తండాల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా మార్గంలో పంచాయతీ రాజ్ రోడ్డుపై గుంతలు పడి కంకర తేలడంతో ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ గ్రామంలోని జాతీయ రహదారి నుంచి పాత గ్రామ పంచాయతీ వరకు 800 మీటర్ల దూరం సీసీ రోడ్డు వేయడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 25లక్షలు మంజూరు చేసింది. గ్రామంలో సీసీ రోడ్డు పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత 2022 మార్చి నాలుగో తేదీన శంకుస్థాపన చేశారు. కానీ సీసీ రోడ్డు పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రానందున నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. తదనంతరం ముల్కలపల్లి జాతీయ రహదారి రోడ్డు నుంచి వయా గంగరాంతండా మీదుగా దేవోజీనాయక్ తండా, గొల్లగూడెం వరకు నాలుగున్నర కిలో మీటర్లు దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.3.37కోట్లను, దయ్యంబండ - కోనాపూర్ మూడు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి షెడ్యూల్డ్ ట్రైబల్ వేల్ఫేర్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) కింద గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి 2023లో శంకుస్థాపన చేసారు. ఈ రోడ్ల నిర్మాణం పనుల్లో భాగంగా సంబంధత కాంట్రాక్టర్లు ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా మధ్యల కల్వర్టుల నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. దయ్యంబండ - కోనాపూర్ మార్గంలో కల్వర్టు నిర్మాణాన్ని ఆరు నెలల క్రితం పూర్తి చేశారు. పొట్టిమర్రి తండా నుంచి నాగాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబల్ వెల్ఫేర్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) కింద రూ. 1.80కోట్లు మంజూరు చేసింది. ఈ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య 2024 మార్చి 13న శంకుస్థాపన చేశారు. సంవత్సరం దాటినా బీటీ రోడ్డు పనులు మాత్రం ముందుకు కదలలేదు. బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనందున సరైన రోడ్డు మార్గం లేక ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజలు, గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోనందున పూర్తికావడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు.



నిర్మాణం పూర్తయిన కల్వర్టులు

రోడ్డు పనులు పూర్తి చేయించాలి



రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయి రెండేళ్లు పూర్తి కావొస్తుంది. గ్రామానికి వెళ్లే కట్టపై మట్టి కుప్పలు పోసి వదిలేయడంతో రాపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే దుమ్మూధూళి ఇళ్లల్లోకి వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయించాలి.

● సిలివేరు దుర్గయ్య, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి

మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు అధ్వానంగా ఉన్నందున మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపై గుంతలు పడి బురదగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతినిదులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలి.

●పసుపుల కనకరాజు, కోనాపూర్, తుర్కపల్లి

నేడు మాలల ఆత్మీయ సమ్మేళనం

చౌటుప్పల్ రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం ఆందోళ్ మైసమ్మ దేవాలయం వద్ద ఈనెల 2వ తేదీన చౌటుప్పల్ డివిజన్ మాల ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు డివిజన్ నాయకులు కట్ట శంకరయ్య, ఈసం సోమేశ్వర్, పి.రవి, రాపోలు పవన్, దాసరి నర్సింహ ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి అంబేడ్కర్ వాది రెంజర్ల రాజేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు. సకాలంలో హాజరుకావాలని కోరారు.

పాలడుగులో బడిబాట

మోత్కూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మోత్కూరు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పాలడుగు ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెంచడానికి వేసవి సెలవుల్లో కూడా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో కూడా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ బడులపై నమ్మకం ఉంచి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌తో రూ.7కోట్ల ఆదాయం

● చెల్లింపు గడువు 3వరకు పొడిగింపు

చౌటుప్పల్ టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 4,087 మంది ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపుతో ప్రభుత్వానికి రూ.7.01కోట్ల ఆదాయం సమకూరింది. 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు జరిగిన ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో 4,087మంది యజమానులు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. అనధికార వెంచర్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్లాట్ల యజమానులకు ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) అవకాశాన్ని కల్పించింది. అందుకు గాను ఎల్ఆర్ఎస్ కోసం మొదటగా 2020లో రూ. 1,000 చెలించి 16,571 మంది ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. రూ. 1000 లు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్దీకరించుకునే అవకాశాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. 16,571 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో కేవలం 4,087 మంది ప్లాట్ల యజమానులు మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీజు ను చెల్లించారు. దీంతో అనధికార వెంచర్‌లలోని ప్లాట్లపై యజమానులకు పూర్తి హక్కులను ప్రభుత్వం కల్పించింది. ఈ ఫీజు చెల్లించిన యజమానులు ప్రభుత్వ అనుమతులు పొంది భవన నిర్మాణాలను చేసుకునేందుకు మార్గమం సుగుమమైంది.



చౌటుప్పల్ మునిసిపల్ కార్యాలయం

ఈనెల 3వరకు అవకాశం

ఎల్ఆర్ఎస్ కు ప్రభుత్వం మూడు రోజులు(ఈనెల 3వ తేదీ వరకు) అవకాశం కల్పించింది. గత మార్చి, ఏప్రిల్ మాసాలలో 25 శాతం సబ్సిడీ అవకాశం కల్పించిన ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తో ఆశించిన రాబడి రాకపోవడంతో మరో మూడు రోజులు గ్రేస్ పీరియడ్ మాదిరిగా అవకాశం ఇచ్చింది. మార్చి 31 తో ముగిసిన గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. అయినా కూడ రాబడి టార్గెట్ ను ప్రభుత్వం అందుకోలేక పోయింది. గడువును మరోమారు పొడిగిస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే. ఎల్ఆర్ఎస్ తో ఇటు ప్లాట్ల యజమానులకు ప్రయోజనం ఉండగా, అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది.

అవగాహన కల్పించినా..

అధికారులు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించినా ఎల్ఆర్ఎస్‌ను చాలా మంది ఉపయోగించుకోలేక పోయారు. మార్చి నెలలో ప్లాట్ల యజమానులలో ఎల్ఆర్ఎస్ పట్ల కనిపించిన ఉత్సాహం ఏప్రిల్ నెలలో కనిపించలేదు. ఏప్రిల్ 30వ తేదీతో ముగిసినా ఎల్ఆర్ఎస్ గడువు ను ప్రభుత్వం మరో మూడు రోజుల పాటు పొడిగించింది.

రీ సేల్‌కు సగం చెల్లింపుతో సరి

అనధికార వెంచర్‌లలోని రీ సేల్ ప్లాట్ల కు కొందరు యజమానులు ఎల్ఆర్ఎస్ ఫీజును సగం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. మిగతా ఫీజును ప్లాట్ కొనుగోలుదారులు భరించడమా లేదా ప్లాట్ అమ్మకందారుడు భరించాలా అన్నది క్రయవిక్రయాలు జరిగినప్పుడు తేల్చుకోవలసి ఉంటుంది.

యజమానులకు తప్పని చిక్కులు

2020 లో ప్రభుత్వానికి రూ. 1000లు చెల్లించి ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్న కొంత మంది ప్లాట్ల యజమానులకు కొన్ని చిక్కులు తలెత్తాయి. ప్రధానంగా చెరువులు, కుంటలు ఉన్న ప్రాంతాలలోని ప్లాట్ల కు ఎఫ్‌టీఎల్‌లో ఉండడంతో నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. వీటితో పాటుగా ఎలాంటి సమస్యలు లేని ప్లాట్లు కూడ నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తోంది. నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సర్వే చేసి వెంట వెంటనే క్లియరెన్స్ ఇస్తున్నారు. అయినా ఈ తతంగానికి రెండు, మూడు రోజుల వ్యవధి పడుతోంది. ఈ రెండు శాఖల అధికారులు క్లియరెన్స్ ఇచ్చిన తరువాత మునిసిపల్ సిబ్బంది కూడ చివరగా తనిఖీ చేసి, ఫైనల్ రిపోర్టు ఇస్తున్నారు. ఈ వ్యవహారం తరువాత ఎల్ఆర్ఎస్ ఫీజును చెల్లించి రశీదును పొందవలసి ఉంటుంది. ఎర్రటి ఎండలో కూడ ఈ మూడు శాఖల అధికారులు, సిబ్బంది ప్లాట్ల ను నేరుగా తనిఖీలు చేసి క్లియరెన్స్ ఇస్తుండడంతో ఎలాంటి పొరపాట్లు జరిగేందుకు అవకాశాలు లేవు. ఇందులో నీటి పారుదల, మునిసిపల్ శాఖల అధికారులు ఎక్కువగా శ్రమ తీసుకోవలసి వస్తోంది.

ఐబీ సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాం

నీటి పారుదల శాఖ కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానుల సమస్య (ఎఫ్‌టీఎల్)ల ను వెంట వెంట నే పరిష్కరించాం. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాని యజమానులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాం. ఈ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి.

-పృథ్వీ, రాజ్యలక్ష్మి, నీటిపారుదల వాఖ ఏఈలు

ఎల్ఆర్ఎస్ ప్రాధాన్యాన్ని వివరించాం



ఎల్ఆర్ఎస్ ప్రాధాన్యాన్ని ప్లాట్ల యజమానులకు సదస్సులు నిర్వహించి వివరించాం. మునిసిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే ప్లాట్ల యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ఈ నెల 3వ తేదీ వరకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-కె.నర్సింహారెడ్డి, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

● జిల్లా కో ఆపరేటివ్ అధికారి మురళీరమణ



రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని జిల్లా కో ఆపరేటీవ్ అధికారి మురళీరమణ(డీసీవో) రైతులకు సూచించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

-(భువనగిరి రూరల్, ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎన్ని పీఏసీఎస్‌లు ఉన్నాయి? ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డీసీవో: జిల్లా పరిధిలో 17మండలాల్లో 21 పీఏసీఎస్ ఉన్నాయి. వాటి పరిధిలో 212 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి: ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి సూచనలిస్తున్నారు?

డీసీవో: రైతులు తమ ధాన్యాన్ని వ్యవసాయ బావుల సమీపంలోని కల్లాల వద్ద ఆరబెట్టుకుని కేంద్రానికి తీసుకురావాలి. తేమ ధాన్యాన్ని కేంద్రానికి తీసుకు వచ్చినట్లయితే కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక కొంత మేర ఇబ్బంది ఏర్పడుతోంది. ఇప్పటికే రైతులకు వ్యవసాయ విస్తర్ణ అధికారులు, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు నిర్వాహకులు అవగాహన కల్పించారు.

ఆంధ్రజ్యోతి: ఈ ఏడాది యాసంగిలో కొనుగోలు లక్ష్యం ఎంత?

డీసీవో: గత యాసంగి సీజన్‌లో పీఏసీఎస్ ద్వారా 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ఈసారి కూడా అదే లక్ష్యంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా ధాన్యం సేకరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు.

డీసీవో: ఇప్పటి వరకు జిల్లాలోని 212పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా సీరియల్ ప్రకారం 4210 మంది రైతుల నుంచి దాదాపు 33వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్నిమౌలిక వసతులు కల్పిస్తున్నాం.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

అడ్డగూడూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ శేషగిరిరావు అన్నారు. గురువారం అడ్డగూడూరు మండల కేంద్రంతో పాటు, ఆజీంపేట, వేల్దేవి, మానాయికుంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తదనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు.

మంతపురిలో పాడి ఆవు మృతి

ఆలేరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని మంతపురి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్లె వెంకులు తమ పశువులను షెడ్డులో కొట్టి బుధవారం రాత్రి కట్టివేసి ఇంటికి వెళ్లారు. తిరిగి తెల్లవారుజామున తమ వ్యవసాయ బావి వద్ద ఉన్న షెడ్డుకు రాగా పాడి ఆవు మృతి చెంది ఉంది. తనకు సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

యాదగిరిగుట్ట రూరల్, మే 1, (ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక గురువారం గుట్టలో జరిగింది. అధ్యక్షుడిగా ఎల్లంకి మహేష్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా కొండూరి వెంకటేశ్, కార్యదర్శిగా పేరబోయిన మహేందర్, ఉపాధ్యక్షులుగా బత్తుల శ్రీనివాస్, మొగుళ్ల శేఖర్, ఎండి.నయీం ఎన్నికయ్యారు.

మాధవరెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం

భూదాన్‌పోచంపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత ఎలిమినేటి మాధవరెడ్డి ఆశయాలసాధనకు కృషి చేద్దామని ఎలిమినేటి మాధవరెడ్డి యువసేన రాష్ట్ర కన్వీనర్ ముత్యాల మహిపాల్‌రెడ్డి, ఎలిమినేటి విజ్ఞాన్ భవన్ చైర్మన్ కొమిరెల్లి నర్సింహారెడ్డి అన్నారు. దివంగత మాధవరెడ్డి 76వ జయంతి వేడుకలు గురువారం భూదాన్‌పోచంపల్లి మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొమిరెల్లి నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎలిమినేటి మాధవరెడ్డి సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు ముందుకు సాగుదామని అన్నారు. దేశ్‌ముఖి గ్రామంలో ఎలిమినేటి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల మహిపాల్‌రెడ్డి, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలోని భూదాన్‌పోచంపల్లి క్రాస్‌రోడ్డువద్ద, భూదాన్‌పోచంపల్లిలోని ఎలిమినేటి మాధవరెడ్డి విజ్ఞాన్ భవన్ వద్ద, మాధవరెడ్డి చౌరస్తా వద్ద మాధవరెడ్డి విగ్రహాల వద్ద పలువురు నాయకులు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎలిమినేటి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల మహిపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, నాయకులు సిద్దగోని రంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బల పద్మారెడ్డి, మాజీ జెడ్పిటీసి పి.పూర్ణచందర్‌రాజు, కె.నర్సిరెడ్డి, చాడ మాజీ సర్పంచ్ ఎం. సుదర్శన్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నందమూరి యువసేన రాష్ట్ర నాయకులు వేప శ్యాంసుందర్ ముదిరాజు, వేప నగేశ్, అయోధ్య, ఎండి సాధిక్, పబ్బు శ్రీనివాస్, సుంకరి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీబీనగర్: మండల కేంద్రంలో దివంగత మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి జయంతి నిర్వహించారు. పట్టణంలో చెరువుకట్ట సమీపంలో మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాసుల సత్యనారాయణ గౌడ్, మన్నె సంజీవరావు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి సురకంటి జంగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి: మాధవరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎఏమ్మార్ విజ్ఞాన్ భవన్ చైర్మన్, మాజీ ఎంపీపీ కొమిరెల్లి నర్సింహారెడ్డి, నాయకులు

బొమ్మలరామారం: మండల కేంద్రంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పాదం కృష్ణ, బేతాళ బాలనరసింహతోపాటు పలు పార్టీల నాయకులు, మాజీ ఎంపీటీసీలు రాజేందర్‌రెడ్డి, మైలారం ఈదమ్మ, శాదం భాస్కర్, రాజు, కట్ట శ్రీకాంత్, షాడో ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామన్నపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మానవత్వం చాటుకున్నారు. రామన్నపేట మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జవ్వాజి వెంకట లక్ష్మమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్న విషయం గ్రామంలోని నాయకులు శంబాల వెంకటేశం, చిల్లర కైలాసం ద్వారా స్థానిక ఎమ్మెల్యే వేముల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించి, పెద్ద మనసుతో ఆ కుటుంబానికి నేను అండగా ఉంటానని తక్షణమే రూ. 10వేలు ఆర్థిక సాయం శంబాల వెంకటేశం ద్వారా అందించారు. ఇక మీదట ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన యువనాయకులు విరాళాలు సేకరించి రూ.22,500 వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

భువనగిరి రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని కూనూరు, కేసారం, పెంచికల్‌పహాడ్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై కేంద్రంలోని నరేంద్రమోదిప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరు తప్పు పట్టాలన్నారు. మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను విస్మరించి వారి చరిత్రను కాలరాసేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాశం శివానంద్, కోట మహేందర్, చందు, దామోదర్, నర్సింగ్ రావు, వెంకటేశ్, కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

మోత్కూరు: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామేల్ ఆదేశానుసారం గురువారం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని మండలంలోని పొడిచేడు గ్రామంలో మండల కో ఆర్డినేటర్ సుంకిశాల అనిల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా కార్యదర్శి మందుల సురేశ్, జిల్లా నాయకులు సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ పేలకుడి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు జిట్టా లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు మధు, మాజీ ఉప సర్పంచ్ లింగాల ఎల్లయ్య పాల్గొన్నారు.

రాజాపేట: రాజాపేట మండలం సింగారం కాల్వపల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను నిర్వహించారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌గౌడ్, పెంటయ్య, గణేష్, ప్రవీణ్‌కుమార్, హరిబాబు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మోత్కూరు: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బేగంపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం బేగంపేట గ్రామంలో 2004-2005 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఆనాడు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించి, వారు చేసిన సేవలను కొనియాడారు. బ్యాచ్‌కు చెందిన నాగారం నర్సింహులు కాసుల స్వామికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బోగ హరినాథ్, ప్రభాకర్‌చారి, రాము, జగన్, నాగేశ్వర్, సైదా, భాగ్య, నిజామ్, సిద్దిరాజు, రామచంద్రం పాల్గొన్నారు.

'10'లో సత్తా చాటిన విజ్ఞాన్ హైస్కూల్



మనోనితీష్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్

యాదగిరిగుట్ట రూరల్, మే 1, (ఆంధ్రజ్యోతి): '10' పరీక్షల ఫలితాల్లో స్థానిక విజ్ఞాన్ హైస్కూల్ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి, 572/600 మార్కులతో కె.మనోనితీష్‌కుమార్ జిల్లా 3వ ర్యాంకు సాధించి సత్తాచాటుకున్నాడు. 557/600 మార్కులు సాధించిన అక్షర మండల రెండో ర్యాంకు, కె.సత్యనారాయణ 3వ ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఐ.రాంరెడ్డి, డైరెక్టర్ రమాదేవి అభినందించారు.

శ్రీగౌతమి హైస్కూల్ విద్యార్థి రమ్యశ్రీ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్

యాదగిరిగుట్ట రూరల్, మే 1, (ఆంధ్రజ్యోతి): '10' పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీగౌతమి హైస్కూల్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి కొంపెల్లి రమ్యశ్రీ 566/600ల మార్కులు సాధించి మండల టాపర్‌గా కైవసం చేసుకుంది. అభిరామ్ 551/ 600ల మార్కులు సాధించి 2వ ర్యాంకు సాధించాడు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మిర్యాల దుర్గాప్రసాద్, డైరెక్టర్ అన్నపూర్ణలు అభినందిచారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మండల వ్యాప్తంగా 97.31 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శరత్‌యాని తెలిపారు.

ట్రినిటీ విద్యార్థులకు ఉత్తమ మార్కులు

చౌటుప్పల్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ స్కూల్‌కు చెందిన ఆర్ల మనోజ్‌కుమార్ 576 మార్కులు, కొలను శివాని 575 మార్కులు సాధించి జిల్లా టాపర్‌లు గా నిలిచారు. వీరికి స్కూల్ ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కృష్ణారావు రూ. 25 వేల వంతున నగదు ను ప్రోత్సాహకంగా అందజేసి అభినందించారు. విద్యార్థులను ఎంఈవో గురువారావు అభినందించారు.

మేడే స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో కార్మికులంతా ఉద్యమించాలని పలువురు వామపక్ష, కార్మిక, ప్రజాసంఘాల నాకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా వ్యాప్తంగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఎం ఏఐటీయూసీ, సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించి, జెండాలను ఆవిష్కరించారు. మేడే ప్రాముఖ్యతను ఆనాటి కార్మికుల పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడీ శక్తులను తుదముట్టించి ఎనిమిది గంటల పనివిధానాన్ని సాధించి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపిన ఎర్రజెండా అమరుల త్యాగాల చరిత్రను నేడు బీజేపీ చెరిపివేయాలని చూస్తోందని అన్నారు. మళ్లీ 12గంటల పని విధానాన్ని తీసుకరావాలని కుట్ర చేస్తోందని అన్నారు. మేడే స్ఫూర్తికి విరుద్ధంగా నేడు మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మికుల పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని అన్నారు. కార్మిక కర్షకుల మధ్యన మతం పేరుతో స్వార్థ రాజకీయాలకు పూనుకుంటోందని, బీజేపీ దుర్మార్గపు చర్యలను తిప్పికొట్టి, ఈనెల 20వ తేదీన జరిగే అఖిల భారత సమ్మెను కార్మికులు, కర్షకులు విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎండీ.జహహంగీర్, గోదా శ్రీరాములు, కొండమడుగు నరసింహ, ఏశాల అశోక్, బట్టుపల్లి అనురాధ, మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేషం, మాయ కృష్ణ, లావుడియా రాజు, గంధమల్ల మాతయ్య, నాగమణి, సామల శోభన్‌బాబు, గనబోయాన వెంకటేష్, ఎండీ సల్మాన్, శారద పాల్గొన్నారు. భువనగిరి మండలంలోని వీరవెల్లి, హన్మాపురం, బస్వాపూర్ తదితర గ్రామాల్లో ఎర్ర జెండాలను ఎగురవేశారు. సీపీఎం నాయకులు దయ్యాల నర్సింహ, పల్లెర్ల అంజయ్య, హమాలీ కార్మికుల సంఘం నాయకులు సిల్వేరు చిన్నయ్య, ఆర్ పరమేశ్, దాసు పాల్గొన్నారు.

● ఆలేరులో సీఐటీయూ, సీపీఐ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కల్లూరి మల్లేశం, దూపటి వెంకటేశ్, ఎక్బాల్, చంద్రశేఖర్, జూకంటి పౌల్, శంకరయ్య, సంగి రాజు, చెక్క వెంకటేశ్, కనకయ్య, పోతు ప్రవీణ్, పి రవి, ఆంజనేయులు, గిరిబోయిన స్వామి, ఉపేందర్, మంగ రవి, మల్లేశ్, వస్పరి బాల మల్లేశ్, మంగ వరలక్ష్మీ, అనిత, యాదగిరి, మల్లయ్య, ఎజాజ్, వెంకటేశ్వర రాజు పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురం: అమరవీరుల స్మారక స్తూపం వద్ద ఎర్రజెండా ఎగురవేస్తున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్



భువనగిరిలో సీపీఎం కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న జిల్లా కార్యదర్శి జహంగీర్

● భూదాన్‌పోచంపల్లి పట్టణం, మండలంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, సీపీఎం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, నాయకులు పగిల్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి పాల్గొన్నారు.

● యాదగిరిగుట్ట పట్టణం, మండలంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, సీపీఐ నాయకులు కళ్లెం కృష్ణ, బబ్బూరి శ్రీధర్, కల్లెపల్లి మహేందర్, పేరబోయిన మహేందర్ పాల్గొన్నారు.

మోత్కూరు పట్టణం, మండలంలో ఐఎన్‌టీయూసీ, సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు జంగ సతీష్, కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కూరెల్ల కుమార్, నాయకులు పి.బాలయ్య, వెంకట నర్సుబి రాజు, ఉయ్యాల అంజయ్య, రాజు, బాశికంటి లక్ష్మి, జంగ నర్సయ్య మల్లేశ్, గంజి సత్తయ్య, యానాల దామోదర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకట్, గొలుసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

● చౌటుప్పల్‌లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, పట్టణ, మండల కార్యదర్శులు గోశిక కరుణాకర్, గంగదేవి సైదులు, దండ అరుణ్‌కుమార్, దాడి సురేందర్ రెడ్డి, ఎండీ .ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు. ఐఎన్‌టీయుసీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ రామచంద్రం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా, చెన్నగోని అంజయ్య తదితరులు పాల్గొన్నారు. సీపీఐ, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పల్లె శేఖర్‌రెడ్డి, రామలింగం పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం మండలంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే.శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు రుద్ర రాములు, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, సుర్వి నరసింహ, దుబ్బాక సంజీవ, పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య పందుల యాదగిరి, పల్లె గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాజాపేట, వలిగొండ, గుండాల, రామన్నపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), బీబీనగర్, మోటకొండూరు మండలాల్లో సీపీఎం, సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎర్రజెండాలను ఎగరవేశారు.